

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శనివారం | నవంబర్ 11, 2023 | www.navatelangana.com

నామినేషన్ల వరద



ఉప ఎన్నికల్లో పాపం అని ఈటలకు ఓటేసారు..

- ఈసారి మూడవ స్థానంలో ఈటల
- కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తేనే అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు

8లో...

- చివరి రోజు పదుల సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్ల దాఖలు
- రెండు నుంచి మూడు సెట్ల నామినేషన్‌పత్రాలు అందజేత
- కరీంనగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల బరిలో 94 మంది
- ఇప్పటివరకు దాఖలైన నామినేషన్ సెట్లు 167
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో 55 మంది అభ్యర్థులు..82సెట్లు
- రేపే పత్రాల పరిశీలన... తేలనున్న అర్హులు
- 15న విత్‌డ్రాకు అవకాశం.. 30న పోలింగ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారంతో ముగిసింది. ఏకాదశి సందర్భంగా ఒక రోజు ముందుగానే ప్రధాన పార్టీలకు చెందిన చాలా మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా చివరి రోజు అభ్యర్థులు పోటెత్తారు. ఒక్కో నియోజకవర్గంలో పదేసి నామినేషన్ పత్రాలు వచ్చాయి. అందులోనూ హుజూరాబాద్

మిగతా 2లో...

నియోజకవర్గం	అభ్యర్థులు	మొత్తం సెట్లు
మానకొండూర్	24	42
హుజూరాబాద్	33	62
చొప్పదండి	20	37
సిరిసిల్ల	23	43
వేములవాడ	22	39
రామగుండం	31	51



బీజేపీ అగ్రవర్ణాల పార్టీ

- బీసీ బిడ్డకు టికెట్ ఇస్తే మహిళపై కుట్రలు..
- మహిళ ఎమ్మెల్యే కాకూడదా..?
- డబ్బు సంచులతో వచ్చే వారికి బిజెపిలో ప్రాధాన్యత..
- కంటతడి పెట్టిన తుల ఉమా..



నవతెలంగాణ - వేములవాడ

బీజేపీ టికెట్ విషయంలో కొన్ని రోజులుగా గందరగోళానికి తెర పడింది. నాలుగో జాబితాలో తుల ఉమకు వేములవాడ నియోజకవర్గం టికెట్ కేటాయించినప్పటికీ రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు, వేములవాడ మండలం అధ్యక్షులు రాష్ట్ర అగ్ర నాయకులకు టికెట్ వికాస్‌కు ఇవ్వాలని మూడు రోజులుగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిరసనకు దిగారు. దిగివచ్చిన అధిష్టానం వికాస్‌కు బీఫామ్ ఇస్తున్నట్టు ప్రకటించింది. తుల ఉమ నామినేషన్‌కు శుక్రవారం మండల కేంద్రాల నుంచి అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నామినేషన్ వేసే చివరి నిమిషంలో భీఫామ్ ఉమకు కాకుండా వికాస్‌కు ఇస్తున్నట్టు పార్టీ అధిష్టానం వెల్లడించింది. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తుల ఉమా మీడియా ముందు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ బీజేపీ బీసీ నినాదాన్ని తుంగలో తొక్కి.. డబ్బులు సంచులతో వచ్చే దొరలకు టికెట్ కేటాయించడం మరో మారు అగ్రవర్ణాల పార్టీ అని రుజువైందని ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి గుంజుకోవడం ఎంతవరకు సమంజసమని పార్టీ అగ్ర నేతలను నిలదీశారు. వేములవాడ 65సంవత్సరాల కాలంగా చెన్నమనేని కుటుంబమే పాలించింది.. ఉద్యమంలో దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశానని వెల్లడించారు. తాను ఎవరికి హాని చేయలేదని, ఇక్కడి నాయకులు తనను నక్సలైట్ అని అంటున్నారని తెలిపింది. నాడు దొరల బానిసత్వ విముక్తి కోసం కొట్లాడానని, నేడు ఇంకా కొట్లాడాల్సిన రోజులు ఉన్నాయన్న ఉమ తాను కచ్చితంగా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే గొర్లు కాసుకునే వాళ్లు కూడా ఎమ్మెల్యేలు అవుతారంటూ ఎగతాళి చేశారని, ఈ ప్రాంతం దొరల చేతిలో బంది అయింది అని ఆవేదన చెందారు.

ఎన్నికల భేరీ.. విధుల్లో నారీ...

- ఎలెక్షన్ డ్యూటీలో మహిళా సివిల్ సర్వెంట్లు
- సవాళ్లను అధిగమిస్తూ కీలక నిర్ణయాలు
- కింది స్థాయి అధికారులకు మార్గనిర్దేశం

నవతెలంగాణ - కోల్‌సిటీ

ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం.. అన్నింటా సగం అంటూ ప్రతీ రంగంలో తమ ప్రత్యేకతను చాటుతున్న నారీమణులు ఈ అసెంబ్లీ ఎన్నికల భేరీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎంతో బాధ్యతాయుతంగా ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ తమ కింది స్థాయి అధికారులను సైతం చాలా క్రమశిక్షణగా నడిపిస్తున్నారు. ఏ ప్రభుత్వ అధికారికైనా ఎన్నికల విధులు నిర్వర్తించడం ఒక పెద్ద సవాలు. దీని ప్రభావం ఎన్నికలు ముగిసి గెలిచిన అభ్యర్థి పదవీకాలం కొనసాగినన్ని రోజులూ ఉంటుంది. ఇటీవల చాలా మంది అభ్యర్థుల విషయంలో కోర్టు తీర్పులను ఆధారం చేసుకొని వారి ఎన్నికను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారి ఏ చిన్న తప్పు చేసినా అది వారి ఉద్యోగ జీవితం, వ్యక్తిగత జీవితంపై ప్రభావం చూపుతాయి. దీంతో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల జీవితాలు సైతం తారుమారు అయ్యే ప్రమాదం ఉంది. ఇంత ప్రాధాన్యం ఉన్న బాధ్యతలను నిర్వర్తించడం అంటే ఒక పెద్ద సవాలే. అలాంటి విధులను సులువుగా నిర్వర్తిస్తున్నారు ఈ మహిళా అధికారులు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, రామగుండం పోలీస్ కమిషనర్ ఐపీఎస్ రెమా రాజేశ్వరీ, రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐఏఎస్ జాల్ద అరుణశ్రీ.

మిగతా 2లో...

నామినేషన్ల వరద



సిరిసిల్ల : బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పిట్టల భూమేష్

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గం నుంచే అత్యధికంగా అభ్యర్థులు రెండు, మూడేసి నామినేషన్‌పత్రాలు సమర్పించారు. ఏదేమైనా రేపు ఆ పత్రాల పరీక్షలనలో ఎన్ని తిరస్కరణకు గురవతాయో.. అర్హులెంత మందో తేలనుంది.

ఈనెల 3 నుంచి శుక్రవారం వరకూ ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను అధికారులు స్వీకరించారు. అయితే తొలి మూడు రోజులు పెద్దగా ఎవరి నుంచి స్పందన రాకపోగా.. కనీసం ఒక్క సెట్ నామినేషన్ కూడా పడలేదు. ఇక 6వ తేదీ నుంచి అభ్యర్థులు ఆయా నామినేషన్ కేంద్రాలకు క్యూకట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులైతే 6, 8, 9 తేదీల్లో మళ్లీమళ్లీ నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో అత్యధికంగా మానకొండూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ తన పేరు మీద నాలుగు, తన భార్య పేరుమీద రెండు సెట్ల పత్రాలు సమర్పించారు. ఇక బీజేపీ నుంచి ఆరెపల్లి మోహన్ నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. రసమయి బాలకిషన్ రెండు సెట్లు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఇక హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడికౌశిక్‌రెడ్డి చివరి రోజున మూడు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, తన భార్య జమున పేరు మీద మూడు సెట్ల చొప్పున ఆరు నామినేషన్‌పత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న ఒడితెల ప్రణవ్ నాలుగు సెట్ల నామినేషన్లను వేశారు. కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్న వారిలో బీఆర్ఎస్ నుంచి గంగుల కమలాకర్ నాలుగు సెట్లు వేయగా.. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ రెండు సెట్లు దాఖలు చేశారు. ఇక పురుమల్ల శ్రీనివాస్ ఒకటి కాంగ్రెస్ తరుపున, మరొకటి స్వతంత్య అభ్యర్థిగా నామినేషన్ వేశారు. చొప్పదండి నుంచి ప్రధాన పార్టీలను పరిశీలిస్తే ఇక్కడ కూడా బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న సుంకె రవిశంకర్ మాత్రం 8వ తేదీన ఒకటి, 9వ తేదీన మూడు సెట్ల నామినేషన్‌పత్రాలు అందజేశారు. ఇదే నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి బొడిగె శోభ రెండు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం రెండు సెట్లు దాఖలు చేశారు.

మరింత ఊపందుకున్న ప్రచారం...

అసెంబ్లీ ఎన్నికల బరిలో ప్రస్తుతం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే పోటీ నెలకొంది. ఈ రెండు పార్టీలూ నువ్వా నేనా అన్నట్టుగా గిరిగీసి కొట్లాడుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇంటింటికీ తిరుగుతున్న అభ్యర్థులు వినూత్న పద్ధతుల్లో ఓట్ల వేట సాగిస్తున్నారు. మూడోమారు అధికార పీఠం ఎక్కేలా 'కారు' రోజు పెంచగా.. ఒక్క అవకాశం ఇస్తే 'ఇందిరమ్మ రాజ్యం' తీసుకొస్తామని కాంగ్రెస్ నేతలు గడపగడపకూ తిరుగుతున్నారు. ఇక బీసీ ముఖ్యమంత్రి అస్త్రాన్ని తెరమీదకు వచ్చిన బీజేపీ మాత్రం క్షేత్రస్థాయిలో పెద్దగా కనిపించడం లేదు. మరోవైపు నామినేషన్ పర్వం ముగిసిన నేపథ్యంలో రేపు వాటిని పరిశీలించనున్నారు. అందులో తేలిన అభ్యర్థులను ప్రకటించనున్నారు. ఈనెల 15న విత్‌డ్రాకు అవకాశం ఇచ్చి ఆ రోజు మిగిలిన స్వతంత్రులకు గుర్తులూ కేటాయించనున్నారు. మొత్తంగా ఈనెల 30న పోలింగ్ నిర్వహించి వచ్చేనెల 3వ తేదీన ఫలితాలు వెల్లడించనున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 55 మంది

నవతెలంగాణ - సిరిసిల్ల : శాసనసభ ఎన్నికలు ఈనెల 30న ఉండడంతో ఈనెల మూడు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలు తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించింది శుక్రవారం కు నామినేషన్ ప్రక్రియ ముగిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 55మంది అభ్యర్థులు82 సెట్లు వేశారు సిరిసిల్ల నియోజకవర్గం శాసనసభ అభ్యర్థిత్వానికి 23 మంది అభ్యర్థులు 43 సెట్లు వేశారు. అలాగే వేములవాడ నియోజకవర్గం శాసనసభ అభ్యర్థిత్వానికి 22మంది అభ్యర్థులు 39సెట్లు వేశారు.

ఆఖరి రోజు అత్యధిక నామినేషన్లు

నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగియగా అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిత్వానికి శుక్రవారం స్వతంత్ర అభ్యర్థిగా జంగిడి మధు నక్క హరీష్ అన్నారం సాయికుమార్ కోడూరి బాలలింగం కటకం మృత్యుంజయం, బుసపురం ప్రవీణ్ కుమార్, నామినేషన్లు వేయగా బీజేపీ అభ్యర్థిగా రాని రుద్రమరెడ్డి విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా లగిశెట్టి శ్రీనివాస్ శివసేన అభ్యర్థిగా గౌటే గణేష్, బీఎస్పీ అభ్యర్థిగా పిట్టల భూమేష్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పత్తిపాక సురేష్, రుద్రమ తరపున గరిబెల్లి ప్రభాకర్, కే తారకరామారావు తరపున బొల్లి రామ్మోహన్, ఆర్పిఐ అంబేద్కర్ అభ్యర్థిగా పల్లికొండ నరసయ్య, ఆర్పిఐ ఆతేవాలే అభ్యర్థిగా రెడ్డి మల్ల శ్రీనివాస్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా దోశల చంద్రం, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా ధ్యాపదేవయ్య శుక్రవారం నామినేషన్లు వేశారు.

ఎన్నికల భేరీ.. విధుల్లో నారీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రతీ ప్రక్రియలో కీలకం.. : కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి (ఐఏఎస్)



ఎన్నికల నోటిఫికేషన్ నుంచి మొదలుకొని, నామినేషన్ల ప్రక్రయ, ఓటరు జాబితా, అభ్యర్థుల జాబితా, ఎన్నికల సమస్యల పరిష్కారం, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారుల నియామకం, ఓటుపై అవగాహన, అభ్యర్థులకు ఎన్నికల పై అవగాహన, ఎన్నికల వ్యయం, ఇతర అధికారులతో బందోబస్తు చర్యలు పర్యవేక్షణ ఇలా ప్రతీ ప్రక్రియపై కలెక్టర్ ముద్ర ఉంటుంది. అంతటి బాధ్యతలను ఎంతో క్రమశిక్షణగా నిర్వర్తిస్తున్నారు పమేలా సత్పతి.

2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన పమేలా సత్పతి భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, భద్రాచలం దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా, భూసేకరణ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అంత ప్రాచుర్యం పొందిన వరంగల్లు మహానగర పాలకసంస్థ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించి నగరాభివద్ధిపై చెరగని ముద్ర వేశారు. అనంతరం యాదాద్రి జిల్లా కలెక్టర్ గా, అనంతరం సాధారణ పరిపాలన విభాగంలో విధులు నిర్వర్తించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఈమెను కరీంనగర్ కలెక్టర్‌గా నియమించారు. రావడంతో ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి అంశాన్ని కూలంకుశంగా పరిశీలించి, కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నారు.

నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు.. : రిటర్నింగ్ అధికారి జాల్ద అరుణ శ్రీ, (ఐఏఎస్)



ఓటరు లిస్టు రూపొందించడం, ఫైనల్ చేయడం. నామినేషన్ కేంద్రాల ఖరారు, ఓటరు చైతన్యం, అభ్యర్థలకు ఎన్నికలపై అవగాహన, వారికి శిక్షణ నామినేషన్ ఫారాల అందజేత, ఆమోదం, అభ్యర్థులకు గర్తులు కేటాయించడం లాంటి కీలక ఘట్టాలు కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతాయి. పోటీలో ఉన్న వారి జాబితా సిద్ధం చేయడం, పోస్టల్ బ్యాలెట్ పత్రాల ముద్రణ, పంపిణీ, ఈవీమ్ ,వీవీ ప్యాట్‌లు సిద్ధం చేయడం, వాటిపై పోలింగ్ సిబ్బంది, అధికారులకు శిక్షణ ఇవ్వడం, పోలింగ్ సరళి పరిశీలన, కౌంటింగ్ లాంటి ఎన్నో సవాళ్లు, ఒత్తిడితో కూడుకున్న బాధ్యతలు నిర్వర్తించడం వీరి విధి. ఇంత ప్రాధాన్యం ఉన్న బాధ్యతలను చాలా చక్కగా, ఓపికగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తున్నారు. 2021 సివిల్స్ కు చెందిన ఈమె పెద్దపల్లిలో అడిషనల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎన్నికల భద్రతా బాధ్యతలు.. : రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ, (ఐపీఎస్)



అసెంబ్లీ ఎన్నికల విధుల్లో భాగంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు సంబంధించి రామగుండం పోలీస్ కమిషనర్ 9 నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన భద్రతను పర్యవేక్షిస్తున్నారు. నిత్యం నిర్వర్తిస్తున్న పోలీసు విధులతో పాటు ఇది అదనంగా ఆమె నిర్వర్తిస్తున్న బాధ్యత ఇది. కమిషనరేట్ పరిధిలో 897 పోలింగ్ లొకేషన్లు ఉండగా 1564 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వాటిలో 237 పోలింగ్ స్టేషన్లు సంక్లిష్టమైనవి. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు 50 ఉన్నాయి. ఎన్నికల నామినేషన్లు, ప్రచారం, ఓటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ వరకు ఈ ప్రాంతాలకు ఆమె భద్రత కల్పించే అత్యంత కీలక బాధ్యత సీపీదే. ఈ విధుల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా అది ఆమె ఉద్యోగ, వ్యక్తిగత జీవితంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో తన కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ ఎన్నికల ఘట్టాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె నల్గొండ ఎస్పీగా, యాదాద్రి డీఐజీగా విధులు నిర్వర్తించారు. కెరళ రాష్ట్రానికి చెందిన ఈమె సీఎస్‌సీలో ఎంటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో పలు పేపర్లకు సమకాలిన అంశాలపై చాలా ఆర్టికల్స్ రాశారు.

కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ - వేములవాడ

వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్‌లో మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం వేములవాడ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఏఐసీసీ కార్యదర్శి ప్రారంభించారు. అనంతరం ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రోజురోజుకీ కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి వేములవాడ నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నుండి భారీ సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు గ్యారెంటీగా అమలు చేయడంతోపాటు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త బూత్ స్థాయి నుండి ఒక సైనికునీ లాగా పని చేయాలని కోరారు. గమ్యం చేరే దాకా ఈ 20రోజులు పోరాడాలని పిలుపునిచ్చారు.

నాంపల్లిలో కారు ఖాళీ.. హస్తం జోరు

వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఖాళీ అయ్యాయి. శుక్రవారం సుమారు 150మందికి పైగా బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వేములవాడ పట్టణానికి చెందిన టిఆర్ఎస్ నాయకుడు బొందిల మహేష్ కాంగ్రెస్‌లో చేరారు

గుమాస్తాలకు కనీస వేతనాలు అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముషం రమేష్, మోర అజయ్



నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ : షాపులు, మాల్స్‌లో పనిచేసే గుమాస్తాలకు బోనస్ కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మూశం రమేష్, మోర అజయ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ఉన్నత చదువులు చదివిన అనేకమంది యువత షాపులు, షాపింగ్ మాల్స్‌లలో పనిచేస్తుంటే యాజమాన్యాలు ఇదే అదనుగా కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. నెలలో ప్రయాణ ఖర్చులు పోను రూ.3నుంచి 6వేలు మాత్రమే వేతనాలు అందుతున్నాయని తెలిపారు. కనీసం టీఏ, డీఏలు కూడా ఇవ్వడంలేదన్నారు. ఒక్కో షాపింగ్ మాల్‌లో 20నుంచి 30మంది కార్మికులు పనిచేస్తున్నా కార్మికశాఖ అధికారులు అటువైపు చూసిన దాఖలాల్లేవన్నారు. వారికి పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా కార్మిక శాఖ అధికారులను పీఎఫ్ అధికారులను తప్పుదోవ పట్టిస్తూ గుమస్తాలకు పెద్ద ఎత్తున నష్టం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మోర తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లీం అభివృద్ధి కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ముస్లీంలకు సంక్షేమ పథకాలను అందించి విద్యార్థులకు నాణ్యమైన చదువులను అందిస్తూ ముస్లీంల అభివృద్ధిని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలతో పాటు ముస్లీంలకు తగిన ప్రాధాన్యత ఇస్తూ ముస్లీం జీవితాల్లో వెలుగులు నింపారని ముస్లీం నాయకులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట, బొప్పాపూర్, బండలింగంపల్లి, సింగారం తదితర గ్రామాల్లో శుక్రవారం సీనియర్ నాయకులు మజీబ్ ఆధ్వర్యంలో ప్రచురించిన ముస్లీంల కోసం అభివృద్ధి జరిగిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ.. ముస్లీం మైనార్టీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. దేశంలో ఎక్కడ లేని పథకాలను మైనార్టీల కోసం తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మైనార్టీ రాష్ట్ర నాయకులు ముజీబ్ కరపత్రాల ద్వారా ఊర్దూలో, తెలుగులో క్లుప్తంగా ప్రచురించి మైనార్టీలకు బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ముస్లీం జీవితాలలో వెలుగులను వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీద్, బొప్పాపూర్ గ్రామ ముస్లీం సంఘ అధ్యక్షుడు ఇర్ఫాన్, బాబా ధకని, పున్ను, రఫీక్, మండల కేంద్రంలో షాదుల్లా, జుబేర్ పాల్గొన్నారు.

బండి సంజయ్ నోట అభివృద్ధి మాట హాస్యాస్పదం..

కరీంనగర్ మేయర్ సునీల్ రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

నవతెలంగాణ-కరీంనగర్
బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండి సంజయ్ నోట కరీంనగర్ నగర అభివృద్ధి అనే కొత్త మాట వినడం చాలా హాస్యాస్పదంగా ఉందని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు నాలుగున్నర సంవత్సరాలుగా అభివృద్ధి అంటే తెలియదని, ప్రజా సమస్యల పట్ల అవగాహన లేని వ్యక్తి అని అన్నారు. అలాంటి వ్యక్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నగర అభివృద్ధిపై చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ నగర అభివృద్ధి విషయంలో బండి సంజయ్ చేస్తున్న వాఖ్యలకు మేము బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కరీంనగర్ నగర అభివృద్ధి విషయంలో నాలుగున్నర సంవత్సరాలుగా మీరు తెచ్చిన నిధులతో చేసిన అభివృద్ధిని ప్రజలకు బహిర్గతం చేయాలని అన్నారు. ఎంపీ ల్యాడ్స్ 90లక్షల నిధులు తప్ప మీ స్వతాహాగా నగర అభివృద్ధికి కోసం తెచ్చిన నిధులేంటో, చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు బహిర్గతం చేయాలని, నగర అభివృద్ధి పట్ల బహిరంగ చర్చకు ఎప్పుడైనా మేము సిద్దమని సవాల్ విసిరారు. మీరు చేసిన అభివృద్ధి మా మంత్రి గంగుల కమలాకర్, బోయినపల్లి వినోద్ కుమార్ ఇరువురు చేసిన అభివృద్ధి పట్ల మేము లెక్కలు, ఆధారాలతో సిద్ధంగా ఉన్నామన్నారు. స్మార్ట్ సిటీ హొదా కరీంనగర్‌కు వచ్చినప్పుడు మీరు కేవలం పాలకవర్గ సభ్యులు అనే విషయాన్ని మరిచి పోవద్దన్నారు. కరీంనగర్ అభివృద్ధి చెందడానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ అన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ని ఆదరించాలని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మోసపూరిత మాటలు నమ్మవద్దని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ చేతులను బలోపేతం చేయాలి

మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ-కొత్తపల్లి
కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ చేతులను బలోపేతం చేయాలని, తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మీదేనని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్, బడ్డిపల్లి గ్రామలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఓటు వేసే ముందు సమైక్య పాలనలో జరిగిన అన్యాయాన్ని గుర్తుంచుకోవాలని, కరెంట్ కోసం, సాగునీటి కోసం కష్టపడ్డ రోజులను గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలో పింఛను ఇవ్వలేదని, కొత్తగా పింఛన్ కావాలంటే మరో లబ్దిదారు చావు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని ఆరోపించారు. కర్ణాటక ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దని, వారి మాటలు నమ్మి మన పొరగాళ్ల నోట్లో మన్ను కొట్టొద్దని పిలుపునిచ్చారు. మళ్లీ ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికలప్పుడే కనిపించి ఆ తర్వాత కనిపించకుండా పోతారని అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

కొత్తపల్లి బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భారతం అభిలాష్ ఆధ్వర్యంలో ఎంబీసీ తెలంగాణ యూత్ ప్రెసిడెంట్ భారత అఖిల్, హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు భారతం సత్యనారాయణ, నాయకులు, యూత్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు భారతం సురేందర్, బొల్లారం అజయ్, కార్తీక్ గుండేటి సాయి తేజ, రాధాకృష్ణ, పట్టణానికి చెందిన 50 మంది యువకులు శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించండి..

ప్రచారంలో ప్రణవ్ తల్లి పద్మశ్రీ


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ తల్లి పద్మశ్రీ

నవతెలంగాణ - హుజూరాబాద్ టౌన్
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్‌ను గెలిపించండి.. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ తల్లి వొడితల పద్మశ్రీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తుందని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళ అధ్యక్షురాలు యేముల పుష్పలత, పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, ఆలేటి సుశీల, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు అఫ్సర్, ఎర్ర రవీందర్, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, రియాజ్, సునిత, విష్ణు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

గురువారం రాత్రి ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామ మాజీ ఎంపిటిసి రామిడి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ ఉప్పుల జనార్ధన్‌రెడ్డి అధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే శుక్రవారం హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితెల ప్రణవ్ స్వగృహంలో తాళ్ళపల్లి రమేష్, సొల్లు బాబుల అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు అభివృద్ధి సంఘం అధ్యక్షులు మాడ్గుల ఓదెలు, పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ప్రతాప తులసి - శ్రీనివాస్‌లు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే కరీంనగర్ రూపురేఖలు మారుస్తా..

కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్



నవతెలంగాణ - కరీంనగర్
కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కరీంనగర్ రూపురేఖలు మారుస్తానని పురమల్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శనతో వెళ్లి నామినేషన్ వేశారు. నామినేషన్ వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నిరంకుశత్వ పాలనకు కరీంనగర్ ప్రజలు చమర గీతం పడుతారని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. గంగుల కమలాకర్ పై 40 వేల మెజారిటీ తో విజయం సాధిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి మస్తాన్ వలీ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు, రమ్యారావు, వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

ఓటు హక్కు, మట్టి దీపాలపై అవగాహన



నవతెలంగాణ - జమ్మికుంట
ఓటు హక్కు మన హక్కు అని ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, రానున్న దీపావళి పండుగ రోజు హంగులు ఆర్భాటాలు కాకుండా మట్టితో తయారు చేసిన దీపాలను ఉపయోగించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలకు, ఒబీలకు, మహిళా సంఘ సభ్యులకు ఓటు హక్కు, దీపావళిలో పండుగ రోజున మట్టి దీపాలను ఉపయోగించాలని అవగాహన సదస్సు నిర్వహించి వివరించారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి, డిఎంసీ శ్రీవాణి, ఏడిఎంసి మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా శుక్రవారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి నామినేషన్‌ను రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్.రాజుకు అందజేశారు. నాలుగు సెట్ల నామినేషన్లను ఆయన దాఖలు చేశారు. ఆయనవెంట టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి.లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బండ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ లో చేరికలు



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ సమక్షంలో రేగుల రవి, రేగుల శ్రీనివాస్, రెగుల సంపత్ పార్టీలో చేరారు. ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నూనె సురేష్, రాజయ్య, గట్టయ్య ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన సిపిఐ నాయకుడు

నవతెలంగాణ - గన్నేరువరం : సిపిఐ మండల సహాయ కార్యదర్శి మొలుగూరి సంపత్, గునుకుల కొండాపూర్ గౌడ సంఘం నాయకులు గుండ రాజు మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో శుక్రవారం చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎంపిటిసీలు గుడెల్లి ఆంజనేయులు, ఏలేటి స్వప్నచంద్రారెడ్డి, జీల తిరుపతి, కయ్యం సంపత్, బొజ్జ శ్రీకాంత్, అందే సంపత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్ సతీమణి ప్రచారం



నవతెలంగాణ - చొప్పదండి
చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ సతీమణి సుంకె దీవెన ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేగా రవిశంకర్‌ను రెండోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పిడి సౌజన్యశ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు ముద్దం కుమార్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

'ఓట్ల రాజకీయం చేస్తున్న బీజేపీ'

నవతెలంగాణ - జమ్మికుంట
తమిళనాడు రాష్ట్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమలై ఓట్ల రాజకీయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని, ఆ ప్రయత్నంలో భాగంగానే దేవుడు లేడని చెప్పిన పెరియార్ ఈవి రామసామి విగ్రహాలు హిందూ దేవుళ్ల గుడులు ముందు మాత్రమే పెట్టారని హిందువులను రెచ్చగొడుతున్నారని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్, భారత నాస్తిక సమాజం అధ్యక్షుడు జీవిత సారయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో పెరియార్ విగ్రహాలు మసీదు, చర్చిల ముందు కూడా ఉన్నాయని తెలిపారు. మతం తలకెక్కితే బుద్ధి మోకాళ్లలోకి దిగుతుందని పెరియార్ చెప్పిన సూక్తి అన్నమలై విషయంలో నిజమనిపిస్తుంది అని అన్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

నవతెలంగాణ - జమ్మికుంట
జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి సోమవారం వరకు సెలవులు ప్రకటించినట్టు మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఈ నెల 14న మార్కెట్ పునః ప్రారంభం అవుతుందని తెలిపారు.

అకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం
ఎన్నికల సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు గురువారం రాత్రి కరీంనగర్ బస్టాండ్‌లో కరీంనగర్ టౌన్ ఏసీపీ జి.నరేందర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, శ్రీనివాస్ అకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రయాణికుల వద్ద ఉన్న సామాగ్రిని తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా మద్యం, నగదు సరఫరా చేయకుండా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని రామకృష్ణ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు వేల్పుల భూపతి యాదవ్, అనగొని కనకయ్య గౌడ్, పండుగ రాజయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోగూరి నరసింహా రెడ్డి, మాచర్ల అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బూత్ కమిటీ సభ్యులే కీలకం

నవతెలంగాణ-ధర్మపురి

ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులదే కీలక పాత్ర అని బీఆర్ఎస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ బిఆర్ఎస్ బూత్ కమిటీ, ప్రజాప్రతినిధుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఉన్న బూత్ కమిటీ ప్రతినిధులు ఓటర్లతో మాట్లాడే విషయాలను


మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

పరిగణలోకి తీసుకొని ఓట్లు వేయిస్తుంటారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయించడంలో మాత్రమే ప్రజా ప్రతినిధులు ముందుంటారని చెప్పారు. రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మేధా స్పోకెన్ ఇంగ్లీష్ నిర్వాహకులు చిరంజీవి, ఎంపీపీ, జడ్పీటీసీ పీఏసీఎస్ అధ్యక్షుడు గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



నిరుపయోగంగా చేతిపంపు

నవతెలంగాణ-రాయికల్

రాయికల్ మున్సిపాలిటీలోని 1వ వార్డులో చేతి పంపు నిరుపయోగంగా మారింది. ఏడు సంవత్సరాలుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేపడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉందని స్థానికులు కోరుతున్నారు,

అనారోగ్యంతో మండల పరిషత్ సూపరిండెంట్ మృతి

నవతెలంగాణ-మల్లాపూర్



మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సుపరిడెంట్ వెంకటేశ్వర స్వామి(55) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. వెంకటేశ్వర స్వామి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2019 నుండి విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యం పాలవ్వగా చికిత్స పొందుతున్నారు. అనారోగ్యం తీవ్రంగా క్షీణించడంతో మెట్టుపల్లి మండలం చౌల మద్ది గ్రామంలో మతి చెందాడు. కాగా ఆయన మృతి పట్ల స్థానిక సిబ్బంది, అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

భారీ వృక్షాల నరికివేత


నరికి వేస్తున్న చెట్లు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి నిజామాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న అతి భారీ వృక్షాలను నరికి వేస్తున్నారు. ఏండ్లుగా జాతీయ రహదారిపై ఇరువైపులా ప్రజలకు నీడనిస్తున్న అతి భారీ వృక్షాలను రోడ్డు వెడల్పులో భాగంగా నరికి వేస్తున్నారు. చెట్లను నరికి వేయకుండా ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చి నాటితే బాగుండేదని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ దివాళి.. శుబ్ దివాళిపై అవగాహన

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని జడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛ్ దివాళి.. శుబ్ దివాళి క్యాంపెనియింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మట్టి పాత్రలోనే దీపాలు వెలిగించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలీస్ పరిశీలకుడికి స్వాగతం పలికిన ఎస్పీ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జగిత్యాల జిల్లాకు పోలీస్ పరిశీలకుడిగా వచ్చిన మేఘాలయ ఐపీఎస్ కేడర్‌కు చెందిన వివేకానంద్ సింగ్‌కు పోలీసు గెస్ట్ హౌజ్‌లో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ స్వాగతం తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాటు, బార్డర్ చెక్ పోస్టలలో వాహనాల తనిఖీలు, అక్రమంగా రవాణా చేస్తున్న నగదు, విలువైన వస్తువులు, మద్యం మొదలగు వాటి స్వాధీనం, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకుంటున్న చర్యల గురించి ఎస్పీ వివరించారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను మొబైల్ నెంబర్ 6302068249కు ఫోన్ చేయవచ్చని జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకులు వివేకానంద్ సింగ్ తెలిపారు. అనంతరం ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ ఎన్నికల సాధారణ పరిశీలకులు హెచ్. బసవ రాజేంద్ర, రాజీవ్ రంజన్ మీనాలకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పొల్యూషన్ రహిత వేడుకలు జరుపుకోవాలి

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మున్సిపాలిటీలో ప్లాస్టిక్, పొల్యూషన్, రహితంగా దీపావళి పండుగ వేడుకలను జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రజలు దీపాలను పోలి ఉండే ప్లాస్టిక్ ప్రమిదలు ఉపయోగించవద్దని, కాలుష్య కారణమైన టపాసులను ఎక్కువగా కాల్చకూడదాన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్లీన్ గ్రీన్ సింగిల్ యూస్ ప్లాస్టిక్ ఫ్రీ దివాళి జరుపుకునేలా ప్రజలు సహకరిస్తూ అందరినీ ప్రోత్సహించాలని కోరారు. టపకాయల , స్వీట్ హౌస్ యజమానులకు ప్లాస్టిక్ కాకుండా జ్యూట్ బ్యాగులను



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ గుర్రం రత్నాకర్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, నరేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్

నవతెలంగాణ-రాయికల్

ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని 48 గ్రామీణ, 12పట్టణ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు, రాంప్స్, తాగు నీరు వంటి సౌకర్యాలను తనిఖీ చేసుకోవాలన్నారు. పోలింగ్ బూత్ పరిధిలో 100 మీటర్ల దూరంలోని వాల్ రైటింగ్ తొలగించాలని సూచిం చారు. ఈ సమావేశంలో సూపరిండెంట్ వేణుమాధవ్, మున్సిపల్ మేనేజర్ వెంకటి పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తిలో యామపుర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. 17 తేమ శాతంతో వరి ధాన్యం తెచ్చి క్వింటాల్‌కు రూ.2203 పొందాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దేశెట్టి రవి, పెంట మహేష్, పారపు శంకర్, అకు లక్ష్మీ రాజం, బుక్య బాపులాల్, దుంపెట మహేష్, తులి భుమయ్య సహకారసంఘ సిబ్బంది శేఖర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్‌లో గ్రామ సంఘ పాలకవర్గ సభ్యులకు, లీడర్లకు, సభ్యులకు ఓటు ప్రాధాన్యత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శంకర్, సీసీలు, వివోఏలు పంచాయతీ కార్యదర్శి గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లచ్చక్కపేటలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం


ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ - సారంగాపూర్

మండలంలోని లచ్చక్కపేట గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సతీమణి రాధిక, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, సర్పంచ్ విజయ రమణారావు, ఫాక్స్ డైరెక్టర్ దామోదర్ రావు, ఉపసర్పంచ్ శ్రీధర్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఆకుల తిరుపతి, ఉపాధ్యక్షుడు శ్రీను, మాజీ ఎంపీటీసీ చిట్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా కేసీఆర్


మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

నవతెలంగాణ- మెట్‌పల్లి

దివ్యాంగులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్‌లో శుక్రవారం దివ్యాంగుల ఆశీర్వాద సభ నిర్వహించగా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డితో కలిసి సంజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల ఆత్మగౌరవంతో ఉండాలని రూ.4016 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పినంత మాత్రనా ప్రజల్లో సీఎం కేసీఆర్‌పై ఉన్న ప్రేమ తగ్గదని తెలిపారు. వికలాంగులు కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవం, ఆత్మ నిబ్బరంతో జీవనం కొనసాగిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించారని కె. వాసుదేవరెడ్డి అన్నారు.

సుంకెరవి శంకర్ ప్రచారం


మాట్లాడుతున్న సుంకెరవిశంకర్

నవతెలంగాణ-మల్యాల

మండలంలోని నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకెరవి శంకర్ ప్రచారం నిర్వహించారు. తొమ్మిదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రామ్మోహన్‌రావు ఎంపీటీసీ నర్సవ్వ, సర్పంచ్ గడ్డం జలజ, సహకార సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థినిల ఆత్మ రక్షణకు కరాటే ఉపయోగం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

విద్యార్థినిల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని హై స్కూల్ హెచ్ఎం రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు కరాటే శిక్షణను అందించాలని ఉద్దేశంతో మూడు నెలల కరాటే శిక్షణ తరగతులను ప్రవేశ పెట్టిందన్నారు. కరాటే శిక్షణా తరగతులు వర్షకొండ హైస్కూల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్త.. ప్రచారంలో.. వ్యక్తిగత దూషణలు విమర్శలు నేరమే!

నవతెలంగాణ - సిరిసిల్ల

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఎన్నికల వేడి రాజుకుంది. పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నవారు ప్రచార పర్వానికి సిద్ధమయ్యారు. కొన్ని నియోజకవర్గాల్లోని కొందరు అభ్యర్థులు లక్ష్మణ రేఖ దాటుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తాజాగా సోషల్ మీడియా వేదికగా ఇరు పార్టీల అభ్యర్థుల వాగ్వివాదం తీవ్ర చర్చగా మారింది. తాము గెలిస్తే ప్రజలకు సమాజానికి ఎటువంటి ఉపయోగకర పనులు చేస్తామో చెప్పుకోవాలి ఇలా కాకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం కులమతపరమైన ఉద్రేకాలు రెచ్చగొట్టేలా మాట్లాడడం నిషేధం. అభ్యర్థులు ఎవరైనా ఇలా ప్రవర్తిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. దీనికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

హద్దులు దాటితే ఇక అంతే...

– ఇప్పటికే ఉన్న విబేధాలను మరింత రెచ్చగొట్టేలా పరస్పర ద్వేశాన్ని పెంచేలా ప్రసంగించడం, కులాలు, జాతుల మధ్య, మత పరమైన, భాషాపరమైన ఉద్రేకాలను సృష్టించేలా ఏ పార్టీ అభ్యర్థులు ప్రవర్తించకూడదు.



▸ ప్రత్యర్థి పార్టీ విధానాలు కార్యకలాపాలపై మాత్రమే విమర్శలు పరిమితం కావాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలు మానుకోవాలి. అనవసర ఆరోపణలు వక్రీకరణలపై విమర్శలు చేయకుండా ఉండాలి.

▸ ఓట్లను పొందడానికి కులం, మతపరమైన భావాల పరంగా అభ్యర్థనలు చేయకూడదు. ప్రచారం కోసం ఏ మతం ప్రార్థనా మందిరాలను, మరే ఇతర ఆరాధనా ప్రదేశాలను వేదికగా ఉపయోగించరాదు. అలా చేస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది.

– ఓటర్లను ప్రలోభ పెట్టడం..బహుమతులు ఇవ్వడం, బెదిరించడం, అసలు ఓటర్లకు బదులుగా వేరే వ్యక్తులను ఓటర్లుగా చూపించడం తప్పు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం పోలింగ్ సమయానికి 48గంటల ముందు నుంచి బహిరంగ సభలు ఏర్పాటుకు అవకాశం లేదు.

▸ శాంతియుత గృహ జీవనం ప్రతి వ్యక్తి హక్కు. వ్యక్తుల ఇంటి ముందు వ్యతిరేక ప్రదర్శనలు, ప్రికెటింగ్లకు దిగడం లక్ష్మణ రేఖ దాటడమే అవుతుంది. పార్టీ జెండాలు పాతడం, బ్యానర్లు కట్టడం, నోటీసులు అతికించడం, నినాదాలు రాయడం ఇతరాత్ర పనులకు స్థలం భవన యజమాని అనుమతి తీసుకోవాలి.

▸ ఇతర పార్టీలు నిర్వహించే ఊరేగింపులు సమావేశాలను భగ్నం చేయడం, అడ్డంకులు సృష్టించడం, భౌతిక దాడులకు దిగడం లాంటి చర్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధం. ఒక రాజకీయ పార్టీ నిర్వహించే సమావేశాలను మరో రాజకీయ పక్షానికి చెందిన కార్యకర్తలు సానుభూతిపరులు భగ్నం చేయడమూ ఉల్లంగన కిందకే వస్తుంది. పార్టీ పోస్టర్లను మరో పార్టీ తొలగించడం నేరమే. ఉల్లంఘన గుర్తిస్తే 1950 లేదా 18005992969 టోల్ ఫ్రీ లేదా సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

నాటి పరిస్థితులెట్టా ఉండే.. నేడు ఎలా ఉన్నాయ్



మాట్లాడుతున్న చల్మెడ

నవతెలంగాణ - కోనరావుపేట

రాష్ట్రంలో ఆనాటి తెలంగాణ ప్రాంతం ఎట్లుండే, ప్రత్యేక పాలనలో ఇప్పుడు ఎట్లుంది అనే విషయాన్ని ప్రజలు గమనించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు అన్నారు. గడపగడపకు గులాబీ జెండా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జడ్పీ చైర్ పర్సన్ అరుణ-రాఘవ రెడ్డి, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డిలతో కలిసి కోనరావుపేట మండలంలోని రామన్నపేట, కొలనూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్ రావు, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తెలియజేయండి..

రాజన్న సిరిసిల్ల అసెంబ్లీ ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహు ఐపీఎస్

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్:



వినిత సాహు ఐపీఎస్

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్న ప్రజలు నేరుగా తెలుపాలని ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినీత సాహు పేర్కొన్నారు. పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు ప్రజల దృష్టికి వస్తే నేరుగా తన నెంబర్‌కు 8121258834 ఫోన్ చేసి ఫిర్యాదు చేయ వచ్చని తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని పంచాయితీ రాజ్ గెస్ట్ హౌస్‌కు ముందస్తు సమాచారంతో వచ్చి తనను కలిసి నేరుగా కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉషు క్రీడాలకు ఎంపికైన రాచర్ల జూనియర్ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాఠశాల క్రీడా సమైక్య ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయిలో ఉషు ఎంపిక పోటీలకు మంగళవారం జిల్లా కేంద్రం లోని ఫండస్ ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ -17, అండర్ - 19 వయస్సు విభాగాల వారీగా పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను శుక్రవారం రాష్ట్రస్తాయికి ఎంపిక చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామంలోని రాచర్ల జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి 9బంగారు, 5వెండి పథకాలు సాధించారు. అండర్19 బాలికల విభాగంలో 52కేజి విభాగంలో కోలా అక్షయ, 56 కేజి విభాగంలో డి. గాయత్రి, 60 కేజి విభాగంలో సిహెచ్ వాణి బంగారు పథకాలు సాధించారు. అలాగే 60 కేజి విభాగంలో పి. శ్రావణి, 65 కేజి విభాగంలో ఎం. శ్రావణి, టి అక్షితలు వెండి పథకాలు సాధించారు. అండర్ 19 బాలుర విభాగంలో 45 కేజి విభాగంలో సిహెచ్. విష్ణువర్ధన్, 56 కేజి విభాగంలో జె. బిన్నిలు బంగారు పథకాలు సాధించారు. 60కేజి విభాగంలో సిహెచ్. వినీత్ వెండి పథకం, 65 కెజీ విభాగంలో బి. హరిచంద్ర ప్రసాద్ బంగారు పథకం, 70 కేజి విభాగంలో బి. ఆకాష్ వెండి పథకం, 75 కేజి విభాగంలో బి. అభిలాష్ బంగారు పథకం, 80 కేజి విభాగంలో పి. స్వప్న బంగారు పథకాలు సాధించారు. క్రీడాకారులకు జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ దేవతా ప్రభాకర్, డివైఎస్ఓ అజ్మీర రాందాస్, కళాశాల డైరెక్టర్ ఏలూరి రాజయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, పిడి హిందూజా, పిఈటిలు ప్రభాకర్, అనిల్, కోచ్ విక్రమ్, ఉమ్మడి జిల్లా ఉషఉ అసోసియేషన్ సెక్రటరీ విద్యాసాగర్‌లు అభినందించారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు

ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినిత సాహు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్



మాట్లాడుతున్న ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు

ఈ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినీత సాహూ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కేంద్ర బలగాల బీఎస్ఎఫ్ సిబ్బందితో చెక్‌పోస్ట్, వెహికల్ చెకింగ్, ఫ్లాగ్ మార్చ్, ఈవీఎం వివిప్యాడ్ స్ట్రాంగ్ రూమ్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలసి ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన అన్ని విధులలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఎన్నికల తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా, ఓటర్లకు భయాందోళనలకు అవకాశం లేకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేయడంలో భరోసా కల్పించడంలో భాగంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కీలకమైన ప్రదేశాలలో సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. చెక్ పోస్టల వద్ద వాహన తనిఖీల సమయంలో, ఎన్నికల బందోబస్తులో భాగంగా విధులు నిర్వహించే సమయంలో ప్రజలతో మర్యాదగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో బీఎస్ఎఫ్ కమాండెంట్ ఆర్ఎన్ బాటి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచరి, బీఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినిత సాహు పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వారి వెంట డిఎస్పీ ఉదయ్ రెడ్డి, సి.ఐ సధన్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

ఆది శ్రీనివాస్ గెలిస్తే నియోజకవర్గ అభివృద్ధి

డీసీసీ కార్యదర్శి తిరుపతి



విలేకర్లతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - రుద్రంగి

వేములవాడ నియోజకవర్గం రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్ జలపతి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పట్నం బాబులను తరిమికొట్టేందుకు ప్రజలందరూ నడుం బిగించాలని కోరారు. పేదలకు భూములు ఇవ్వాలన్నా, ఇండ్లు కట్టించాలన్నా, మన పొలాలకు నీళ్లు రావాలన్నా, మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలన్నా, పరిశ్రమలు ఏర్పాటు జరగాలన్నా రావాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వివరించారు.

ప్రచార ఖర్చుల నమోదు పకడ్బందీగా చేపట్టాలి

ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



సిబ్బందికి కి సూచనలు అందజేస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండ సామి

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు నమోదు చేయాలని కేంద్ర, రాజన్న సిరిసిల్ల ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారి కార్యాలయాలను అయన తనిఖీ చేశారు. షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లను, ఫోల్డర్ ఆఫ్ ఎవిడెన్స్ లను పరిశీలించారు. అనంతరం సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు, వీఎస్టీ, వీవీటీ టీమ్‌లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నామినేషన్ దాఖలు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వ్యయ పరిశీలన బృందాలు ఖర్చుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు ఏర్పాటు చేసిన నిఘా బృందాలు జిల్లాలో సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని నోడల్ అధికారులకు సూచించారు. ఆమోదయోగ్యం కాని ఖర్చుల వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు అకౌంట్ బృందం, వీఎస్టీ, వీవీటీలు పర్యవేక్షించాలన్నారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్లన్నింటిని వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులను సమన్వయం చేసుకోవాలన్నారు. నిర్ణయించిన రేటు ప్రకారం ఖర్చులు నమోదు చేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామ కృష్ణ, ప్రత్యేక అధికారిని స్వప్న తదితరులు ఉన్నారు.

అనధికార మద్యం దుకాణాలు నడిపితే కఠిన చర్యలు

నవతెలంగాణ - సిరసిల్ల టౌన్



అనధికార మద్యం దుకాణాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోనీ గ్రామాలు, పట్టణాలలో అనధికార మద్యం దుకాణాలు నడిపితే సమాచారం ఇవ్వవాలని, వాటిని సీజ్ చేయడంతో పాటు బాధ్యుల పై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎన్నికల కొరకు మద్యాన్ని నిల్వ ఉంచిన 8712658829, 8712658830, 8712658831, 8712658828 నెంబర్లకు లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఎన్నికల వేళ నకిలీ మద్యం గుర్తించడానికి వేరిట్ యాప్‌ను ప్రవేశ పెట్టామని, దీని ద్వారా లిక్కర్‌పై ఉన్న బార్‌కోడ్‌తో మద్యం నకిలీదా ఒరిజినలా అని తెలుస్తుందని తెలిపారు. మద్యం పంపిణీ, అక్రమ మద్యం నిల్వలపై సమాచారం ఇవ్వాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి

అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్

నవతెలంగాణ -ధర్మారం



రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరపొందాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. మండలంలోని కిల్లా వనపర్తి నంది మేడారం గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని అన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు తమ ఫోన్ నెంబర్‌ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి తీసుకుని రావాల న్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ, సంబంధిత శాఖ అధికారులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జూలపల్లి



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మేనేజర్ సిబ్బంది

జూలపల్లి మండలంలో యూనియన్ బ్యాంక్ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూలపల్లి బ్రాంచ్ మేనేజర్ సురేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు యూనియన్ బ్యాంకు ఎన్నో సేవలను అందిస్తుందని, తక్కువ వడ్డీకి రుణాలను అందిస్తూ, బంగారు ఆభరణలపై తక్షణ ఋణ సదుపాయం కలదని మేనేజర్ సురేష్ అన్నారు. వారి వెంట ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, అబ్బాపూర్ సర్పంచ్ ఈర్ల మల్లేశం, కుమ్మరికుంట ఎంపీటీసీ తమ్మడవేణి మల్లేశం, తోట సత్యనారాయణ, డైరెక్టర్ తోగర్ శ్రీనివాస్, బ్యాంకు సిబ్బంది, సీసీ జ్యోతి పాల్గొన్నారు.

అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను సందర్శించిన నియోజకవర్గ పరిశీలకుడు శ్రీధర్

నవతెలంగాణ ఓదెల:



చెక్‌పోస్ట్‌ను సందర్శించిన నియోజకవర్గ పరిశీలకుడు శ్రీధర్

ఓదెల మండలంలోని గుంపుల గ్రామంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టును శుక్రవారం రోజున నియోజకవర్గ పరిశీలకుడు సీఎన్ శ్రీధర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఓదెల తహసీల్దార్ యాకన్న, సుల్తానాబాద్ సీఐ జగదీష్, పొత్కపల్లి ఎస్సై శ్రీధర్, ఆర్ఐ రాజేందర్ ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ -ముత్తారం:



పరామర్శిస్తున్న నాయకులు

ముత్తారం గ్రామానికి చెందిన నల్లి శంకర్ తల్లి ఇటీవల మరణించగా, ఆ కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు, సర్పంచ్ తూటి రజిత రఫీ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదం శ్రీనివాస్, రాపెల్లి రామన్న, బోల్నేని బుచ్చంరావు, అమ్ము రవి, కోల విజయ్, గుడి రాములు, శ్రీనివాస్ తదితరులున్నారు.

అర్థ బలం, అంగ బలం ఉన్నవాడు ఎప్పుడూ నాయకుడు కాలేడు

రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ-గోదావరిఖని:



ప్రజలను కలుసుకుంటున్న సోమారపు సత్యనారాయణ

అర్థ బలం, అంగ బలం ఉన్నవాడు ఎప్పుడూ నాయకుడు కాలేడని రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ అన్నారు. ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోరుకున్న వారిని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని అన్నారు. రామగుండం కార్పొరేషన్ 6,7 డివిజన్లలో వడ్లూరి రవి, కొలపల్లి రవి, దాసరి రాజేశం, న్యాతరి రాయమల్లు అధ్యక్షతన సోమారపు సత్యనారాయణ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండంలో ఎవరికి దక్కని ప్రేమ, అభిమానాలు ఇక్కడి ప్రజలు నాకు ఇచ్చారని, నేను అధికారంలో ఉన్నా.. లేకున్నా ఎప్పుడు నేను మీ వాడినేనని, ప్రజల మనసును గెలిచిన వాడే నిజమైన నాయకుడు అవుతాడని అన్నారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యే గా గెలిచానంటే మీ అందరి సహకారంతో గెలిచి, ఈ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమారపు అరుణ్ లావణ్య, మాజీ మేయర్ రాజమణి, కుసుమ, కొకుల శ్రీనివాస్, రాసకట్ల సంపత్, బండారి సుధాకర్, మంజుల, పుష్ప, లావణ్య, సింధు, మాజీ కార్పొరేటర్లు పిడుగు కష్ణ, కోదాటి ప్రవీణ్, వడ్లూరి రవి, రవి నాయక్, వీరన్న, పత్తి సంజీవ్, సుభాష్, నారాయణ రెడ్డి, బిక్షపతి, చంద్రశేఖర్ గౌడ్, సంపంగి శ్రీనివాసు, కమల్ గౌడ్, రాజు డేవిడ్, రాయమల్లు, రమణారెడ్డి, సురేష్, రాజు తదితరులున్నారు.

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలి

రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా

నవతెలంగాణ-గోదావరిఖని:



ఎన్నికల ప్రక్రియ, పర్యవేక్షణను పూర్తి పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్‌సింగ్ రానా అన్నారు. శుక్రవారం, ఆయన ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసి, పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీ-విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిక్స్ బృందాలకు సమాచారం అందించి వాటిని పరిష్కరిస్తున్నామని రిటర్నింగ్ అధికారి ఎన్నికల సాధారణ పరిశీలకులకు వివరించారు. నామినేషన్ ప్రక్రియ, వెరిఫికేషన్ రూమ్, నోటీస్ బోర్డ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్ జే.అరుణశ్రీ, పోస్టల్ బ్యాలెట్, 12డి విభాగం నోడల్ అధికారి జ్యోతి, ఈవీఎం పరికరాల విభాగం నోడల్ అధికారి రామ్మోహన్‌రావు, ఏఆర్‌వో కుమారస్వామి, సహాయ వ్యయ పరిశీలన అధికారి అశోక్ కుమార్,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

నవ తెలంగాణ-సుల్తానాబాద్



ముందస్తు దీపావళి వేడుకలు

చీకటిని పారద్రోలుతూ జీవితాల్లో వెలుగులు నింపే పండుగ దీపావళి అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండగ ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకువచ్చి, ఆరోగ్యాన్ని సంతోషాన్ని కోరుకుంటూ దీపావళి వేడుకలను జరుపుకుంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దీపావళి నాటిక నృత్యాలు పలువురిని అకర్షింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఐపీఎస్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

నవ తెలంగాణ-సుల్తానాబాద్



ఐపీఎస్ పాఠశాలలో దీపావళి వేడుకలు

దీపావళి అనగా దీపముల వరుస అని అర్థం అనగా మనుష్యులలోని అజ్ఞానపు చీకట్లను తొలగించుకొని సన్మార్గంవైపు నడవాలని దీపపు వెలుగు తెలియజేస్తుందని, దీపావళి రోజున విద్యార్థులందరూ ఒక దీపం వెలిగించాలని ఆ దీపపు వెలుగు మానవత్వంతో సన్మార్గం వైపు దారి చూపే వెలుగు కావాలని ఐపీఎస్ పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. శుక్రవారం సుల్తానా బాద్ పట్టణంలోనీ ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో జరిగిన ముందస్తు దీపావళి వేడుకల్లో చిన్నపిల్లల వేషధారణలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీవాతీగా వస్తుందని తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలి

స్వతంత్ర అభ్యర్థి నాగినేని జగదీశ్వరరావు

నవతెలంగాణ-ముత్తారం:

మంథని నియోజక వర్గ ప్రజలు వికలాంగుడినైన తనను ఆశీర్వదించా లని, వికలాంగుల సమస్యల కోసం స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు 5శాతం రిజర్వేషన్ అమలు అయ్యే విధంగా కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి నాగినేని జగదీశ్వరరావు అన్నారు.నాగినేని జగదీశ్వర రావు మంథని నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసెట్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరాలంటే వికలాంగుడినైన నాకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజల కష్టాలు తీరుస్తానన్నారు.

శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలు ఖండిస్తున్నాం

టీడీపీ మండలాధ్యక్షుడు మేదరవైన ఒదేలు యాదవ్

నవతెలంగాణ-మంథని

మంథని నియోజకవర్గంలో టీడీపీ పైన మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు మేదరవైన ఒదేలు యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తి వల్ల వ్యవస్థ ఆగదని, అతను ఒక్కడు దూరమైతే పార్టీ లేనట్లు కాదని గుర్తు చేశారు. మంథనిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉన్నట్లు ఓదెలు యాదవ్ తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

ఆహ్వానించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ ఓదెల:

పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఓదెల మండల కేంద్రానికి చెందిన శివాలయం యూత్‌కి చెందిన యువకులు మార్క చందు, గట్టు అరవింద్,భూసారపు రాకేష్, నాగపురి సిద్ధు, నాగపురి రాకేష్,కాసారపు రాజు,మార్క సాగర్,పోతుగంటి అజయ్‌లు బీఆర్ఎస్ పార్టీలో చేరగా పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పచ్చిమట్ల శ్రీనివాస్,మార్క రవికుమార్, కనికిరెడ్డి సతీష్, బుద్దె రామస్వామి, బుద్దె పోచెట్టి, బోడకుంట మహేందర్, పడాల మల్లయ్యలు పాల్గొన్నారు.

విజయరమణారావు గెలవాలని ప్రత్యేక పూజలు



నవతెలంగాణ ఓదెల:

పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయరమణారావు గెలవాలని జిల్లాలోని అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతకుంట విజయ రమణారావు భారీ మెజార్టీతో గెలవాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష గెలుపుకై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మహిళలు

సుల్తానాబాద్-నవ తెలంగాణ

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉషను ప్రజలు ఆదరించి ఏనుగు గుర్తుపై ఓటు వేసి దాసరి ఉషను గెలిపించాలని సుల్తానాబాద్ పట్టణంలో శుక్రవారం మాజీ వార్డు సభ్యురాలు కొండ రజిత శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న దోపిడీని ప్రజలకు వివరిస్తూ బీఎస్పీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

దుర్గం నగేష్ నామినేషన్

నవతెలంగాణ-మంథని


విలేకరులతో మాట్లాడుతున్న దుర్గం నగేష్

మంథని నియోజకవర్గ కేంద్రంలో ప్రజారాజ్య సమితి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం నగేష్ శుక్రవారం మంథని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాల యంలో అధికారి వి.హనుమ నాయక్‌కు తన నామినేషన్ పత్రాల ను సమర్పించారు. అనంతరం దుర్గం నగేష్ మాట్లాడుతూ రాజ్యాంగం లోని హక్కులు, రిజర్వేషన్‌లు ప్రతి ఒక్కరికీ అందాలనే ప్రజా రాజ్యసమితి పార్టీ ముఖ్యలక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. విద్య, వైద్యం జాతీయం చేయాలనే లక్ష్యంతో ఎన్నికల్లో పోటీచేస్తున్నా మన్నారు.

కేసీఆర్‌ను ఓడించడమే నా లక్ష్యం

స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి చంద్రమోహన్

నవతెలంగాణ-మంథని



గజ్వేల్ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఓడించడమే లక్ష్యంగా నేను పోటీ చేస్తున్నానని గజ్వేల్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి మంథని నియోజకవర్గంలోని సిరిపురం గ్రామానికి చెందిన దాసరి చంద్రమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కట్టిన మేడిగడ్డ, అన్నారం,సుందిళ్ల బ్యారేజీలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని వాటి ద్వారా రైతుల భూములు ముంపునకు గురవుతున్నాయని ఆయన ఆరోపించారు. కేసీఆర్ ఓటమిపాలైతేనే రాష్ట్రంలోని రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి ఇల్లు తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఓడించడం లక్ష్యంగా ప్రచారం కొనసాగిస్తానని ఆయన ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ పథకాలే మళ్ళీ గెలిపిస్తాయి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్


మంత్రి కొప్పులను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, ఆ పథకాలే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తాయని మంత్రి ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్‌లోని కొప్పుల ఈశ్వర్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పథకాలను విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు అంబటి లక్ష్మి నారాయణ, పర్స రాజయ్య, బంద్ర మొగిలి, బంద్ర అజయ్ పాల్గొన్నారు.

సుందిళ్ల గ్రామాన్ని టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట

నవతెలంగాణ-రామగిరి


పుట్ట మధును గజమాలతో సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుందిళ్ల గ్రామాన్ని టూరిస్టు హబ్‌గా అభివృద్ధి చేస్తానని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూ కర్ అన్నా రు. సుందిళ్ల గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం సభలో మా ట్లాడుతూ, సుందిళ్ల గ్రా మానికి తనకు విడదీ యలేని అనుబంధం ఉందన్నారు. కాంగ్రె స్ వాళ్ల మాటలు.. తప్ప చేతలు ఉండవని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాజాలింగు, రామగిరి జడ్పీటీసీ మేదరవేన శారద- కుమార్ యాదవ్, రామగిరి మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శెంకేషి రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

ఆట్టహాసంగా విజయరమణా రావు నామినేషన్

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్


ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకలు

పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతకుంట విజయరమణరావు నామి నేషన్ సందర్భంగా పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ నుంచి కమాన్ చౌరస్తా,జెండా కూడలి మీదుగా ఆర్డీవో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు.అనంతరం పెద్దపల్లి ఎన్నికల అధికారికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు నామినేషన్ పత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు సుదీప్ చాకొటే, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, ఏలువాక రాజయ్య, గోపగోని సారయ్య గౌడ్, ఎడవెల్లి జైపాల్ రెడ్డి,కోట శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులు, సిపిఐ నాయకులు తాండ్ర సదానందం,బాలసాని లెనిన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్

పెద్దపల్లి మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ పాగల సోని శ్రీకాంత్ శుక్రవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయ రమణా రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఆయనకు కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు.ఈ సందర్భంగా విజయరమణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నియోజ కవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలు సహజ సంపాదను దోచుకుం టున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు,నుగిల్ల మల్లయ్య,ఊట్ల వరప్రసాద్, సయ్యద్ మస్రత్,సర్వర్ పాషా, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు సురేష్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్



మాట్లాడుతున్న సురేష్

భారత రాజ్యాంగ స్థానంలో మను అధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీని తిరిగి అధికారంలో రాకుండా ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని కేవీపీఎస్ రాష్ట్ర సహయ కార్యదర్శి తిప్పారపు సురేష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ ముద్రించిన, చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిప్పారపు సురేష్ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలైన దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం ప్రజా సంఘాలు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి డిసెంబర్ 4న చలో ఢిల్లీకి తరలి రావాలని పిలుపు నిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పెత్తం దారుల ఒత్తిడి వలన ఉపాధి పనికి నిధులు తగ్గించి పనిని ఎత్తేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్,జిల్లా అధ్యక్షుడు మోదుంపల్లి శ్రవణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి నవీన్, ఎస్ ఎఫ్ఐజిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, పాల్గొన్నారు.

పుట్ట మధు గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని ప్రసాద్

నవతెలంగాణ-మంథని


మాట్లాడుతున్న నేతకాని రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకులు

ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు గెలుపే లక్ష్యంగా నేతకాని విద్యార్థి సంఘం తరపున పనిచేస్తామని నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని నియోజక వర్గంలో ఎంతోమంది పేదలకు సేవ చేస్తూ ఈ ప్రాంతంలో 200 మందికి వివాహాలు పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పిస్తూ ఆర్థిక సహాయం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు తెలంగాణ రాష్ట్ర నేత కానీ విద్యార్థి సంఘం తరపున మద్దతు తెలుపుతు న్నామన్నారు. గత ఐదు సంవత్సరాల పరిపాలనలో మంథని ప్రాంతంలో ఉన్న ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసి ప్రజల మన్ననలు మధు గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు. సెగ్గెం రాజేష్, నేతకాని విద్యార్థి సంఘం సభ్యుడు సోషల్ మీడియా కార్యదర్శి బోర్లకుంట రాజేష్, గోమాస సుధాకర్,దుర్గం రాజ్ కుమార్,బోయాజ్ శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా బీజేపీ మాదిగలను సంవత్సరాల కొద్దీ నమ్మించి మోసం చేస్తోందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్య మాదిగ ఆరోపించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాకముందు వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని స్వయంగా బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, సుష్మా స్వరాజ్ చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇచ్చిన మాట తప్పారని, మాదిగ, మాదిగ ఉప కులాలు బాగుకోసం అనేక సంక్షేమ పథకాలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికే మాదిగల ఓట్లు వేస్తామని ప్రకటిం చారు. సమావేశంలో పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ చంటి మల్లేష్, పెద్దపల్లి మండలం కోఆర్డినేటర్ సంటి తిరుపతి పాల్గొన్నారు.

ఏక్లాస్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

నవతెలంగాణ-మంథని


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ.విజ య్ భాస్కర్ రెడ్డి సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మంథని ఎక్సైజ్ సీఐ గురవయ్య, పెద్దపల్లి డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు

నవతెలంగాణ-మంథని


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మంథని నియోజ కవర్గం లోని తూర్పు మండలా లతో పాటు రామగిరి, కమాన్‌పూర్, మహాదేవ్ వపూర్, కాటారం, ముత్తా రం మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి చేరామని, పుట్ట మధు గెలుపుకోసం కృషి చేస్తామని వారు తెలిపారు.

మానవత్వం చాటిన చంద్రుపట్ల సునీల్ రెడ్డి


గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న సునీల్ రెడ్డి


నవతెలంగాణ-మంథని

మంథని డివిజన్ పరిధిలోని రామగిరి మండలం రాజాపూర్ వద్ద రెండు బైక్‌లు ఢీ కొనగా ఎన్నికల ప్రచారం నిమిత్తం పాలకుర్తి వెళ్తున్న సునీల్ రెడ్డి చూసి తీవ్ర గాయాలైన నలుగురిని తన వాహనంలో మంథని హాస్పిటల్ కు తరలించి మానవత్వం చాటుకున్నారు.

మంథనిలో టీడీపీని పటిష్టం చేస్తాం

నియోజకవర్గ బాధ్యుడు అందె భాస్కరాచారి

నవతెలంగాణ-మంథని:



తెలుగుదేశం పార్టీ మంథని లో ఖాళీ అయిందని చౌకబా రు మాటలు మాట్లాడుతన్న వారు పార్టీలో వారి స్థానం ఏంటో గుర్తించాలని మంథని నియోజకవర్గ బాధ్యుడు అందె భాస్కరాచారి అన్నారు. పార్టీలో అనేక పదవులు అను భవించి పార్టీ కష్టకాలంలో ఉంటే వదిలి వెళ్లిన వారిని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు.బీఆర్ఎస్ నాయకులకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేక పక్క పార్టీల నేతలను కొనుగోలు చేస్తున్నారని ఆరోపిం చారు. వ్యక్తులు పోయినంత మాత్రాన పార్టీ పోదన్నారు. టీడీపీకి పూర్వ వైభవం తీసుకోస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మార్చిలోపు సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేసి కమిటీలు వేస్తామని అన్నారు.

గాయత్రిలో వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్


వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లి జిల్లా కేంద్రం లోనిగా యత్రి జూని యర్ కళాశాలలో బా లల దినోత్సవం సంద ర్భంగా నేటి సమాజం లో విద్యార్థి బాధ్యత అనేఅంశంపై శుక్ర వారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిం చారు.ఈ పోటీలలో జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన తొమ్మిది, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎల్లంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బండి సంజయ్ సవాల్‌ను స్వీకరిస్తున్నాం..

మంత్రి గంగులపై మాట్లాడే అర్హత పురమల్లకు లేదు

బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

నవతెలంగాణ - కరీంనగర్

అభివృద్ధిపై కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన సవాల్‌ను బీఆర్ఎస్ నాయకులుగా తాము స్వీకరిస్తున్నామని.. బహిరంగ చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని 37వ డివిజన్ మీసేవా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బండి సంజయ్ ఒక్క రూపాయి తేలేదని నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ చౌక్‌లో అనుమతులు తీసుకుంటానని, మీరు చెప్పిన టైంకే వస్తానని సవాల్ విసిరారు. 14, 15 ఫైనాన్స్ నిధులు రావడం సహజమేనని, ఇందులో బండి సంజయ్ చేసిందేమిలేదన్నారు. కేంద్రం స్మార్ట్ సిటీ హైదరాబాద్‌కు ఇస్తే సీఎం కేసీఆర్ కరీంనగర్‌కు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మంత్రి గంగుల కమలాకర్ కృషి ఎనలేదన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం 350 కోట్ల సీఎం హామీ నిధులు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించేందుకు అదనంగా మరో 50 కోట్లు తెచ్చిన ఘనత మంత్రి గంగుల కమలాకర్‌దేనన్నారు. ఎంపీగా గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖల నుంచి తెచ్చిన నిధులు ఏమైనా ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తగా, జెడ్పీటీసీగా గెలిచిన చరిత్ర పురుమల్ల శ్రీనివాస్ దంపతులదని అన్నారు. మంత్రి గంగుల ఇచ్చిన నిధులతో కరీంనగర్ రూరల్ మండలం అభివృద్ధి చెందిన విషయం మరిచి మాట్లాడుతున్నారన్నారు. భూకబ్జాలతో వచ్చిన డబ్బులతో, కాంగ్రెస్ టికెట్ కొనుక్కున్న పురుమల్లకు మంత్రి గంగులపై మాట్లాడే అర్హత లేదన్నారు. అభివృద్ధి ఎజెండగా ముందుకుపోతున్న మంత్రి గంగులపై మాట్లాడే ముందు శ్రీనివాస్ ఆలోచించాలన్నారు. గడపగడపకు వెళ్లి నీ చరిత్రను వివరిస్తామని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ రెడ్డి, నాయకులు షౌకత్ అలీ, ఆరె రవి, వంగ హరీష్, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, నారదాసు వసంతరావు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో సీపీ తనిఖీ



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్ కమిషనరేట్‌లోని గంగాధర, రామడుగు పోలీస్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేసారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్తులపై, రౌడీ షీటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బౌండ్ డౌన్ చేసి పూచికత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్ష కూడా విధించబడుతుందని వారికి తెలపాలన్నారు. చొప్పదండి ఇన్‌స్పెక్టర్ గోపతి రవీందర్, స్థానిక ఎస్ఐలు అభిలాష్, తోట తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

టపాకాయలతో జాగ్రత్త

ప్రముఖ కంటి వైద్య నిపుణులు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట

ఆనందమయ దీపావళి జరుపుకోవాలంటే టపాకాయలతో జాగ్రత్తలు తీసుకొని కాల్చాలని జమ్మికుంట ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో దీపావళికి టపాకాయలు కాల్చి కంటి చికిత్సకు వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందే జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని సూచించారు. పిల్లల వెంట పెద్దలు ఉండాలని చెప్పారు.

ఉప ఎన్నికల్లో పాపం అని ఈటలకు ఓటేసారు..

ఈసారి మూడవ స్థానంలో ఈటల

కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తేనే అభివృద్ధి

రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ - జమ్మికుంట

హుజురాబాద్‌లో 2021 ఉప ఎన్నికల్లో తాను ఢిల్లీకి పెద్ద లీడర్‌ను అయినానని, ఈ ఒక్కసారి ఓటు వేయాలని మొసలి కన్నీరు కారిస్తే పాపం అని ఓట్లు వేసి ఈటల రాజేందర్‌ను గెలిపించారని, ఈ సారి ఎన్నికల్లో మూడవ స్థానంలోకి బీజేపీ పోతోందని అన్ని సర్వే రిపోర్టులు చెబుతున్నాయని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలో గాంధీ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్నర్ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజకుమార్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా హరీశ్‌రావు విచ్చేసి మాట్లాడారు. ఈటలకు ఓటు వేస్తే సిలిండర్ రూ.2000, నిత్యవసరంగా ధరలు పెరుగుతాయని, 10 సంవత్సరాలు అభివృద్ధి వెనుకకు పోతుందని అన్నారు రాష్ట్రంలో బీజేపీకి ఉన్న మూడు సీట్లు కూడా రావన్నారు. ఆ పార్టీ పవన్ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకుందని.. సమైక్యవాదులతో పొత్తు పెట్టుకున్నప్పుడు మీ ఆత్మగౌరవం ఎక్కడ పోయిందని ఈటల రాజేందర్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ6 గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని దానికి గ్యారెంటీ ఎవరు అని అన్నారు. కౌశిక్‌రెడ్డిని గెలిపిస్తేనే అభివృద్ధి కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు టంగుటూరి రాజకుమార్, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, కేడీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పింగిలి రమేష్, ఎంపీపీ మమత, సింగిల్ విండో అధ్యక్షుడు పొన్నగంటి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్

నవతెలంగాణ - హుజురాబాద్ టౌన్

హుజురాబాద్ ప్రజలు ఇచ్చే తీర్పుపైనే హుజురాబాద్ మార్పు ఆధారపడి ఉందని.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మరాజుపల్లి, కనుకులగిద్దె, కందుగుల, చిన్నపాపయ్య, పెద్దపాపయ్య గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 200 యూనిట్ల వరకు విద్యుత్తు బిల్లు ఉచితమని తెలిపారు ప్రతి మహిళకు నెలకు 2500 రూపాయలు ఇస్తామన్నారు. రైతులకు రైతు భరోసా కింద 15000 రూపాయలు సంవత్సరానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్, నాయకులు జక్కుల రమేష్, అనిల్, సాంబయ్య ముకుందరెడ్డి, ఇంద్రసేనరెడ్డి, నాయకులు పొనుగంటి కిరణ్‌రెడ్డి, ఇమ్మడి దయాకర్, రత్నాకర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, శృతి, దాసి సదానందం, రాజయ్య, కోమల్‌రెడ్డి పాల్గొన్నారు.

మెగా స్పోర్ట్స్ మీట్ - 2023 పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - తిమ్మాపూర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

తిమ్మాపూర్ మండలం శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబర్ 4నుండి 9వరకు నిర్వహించే స్పోర్ట్స్ మీట్- 2023 పోస్టర్‌ను శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి, డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ వారం రోజులు స్పోర్ట్స్ మీట్ లో నిర్వహించబోయే ఈవెంట్స్ వివరాలను స్పోర్ట్స్ మీట్స్ కార్య నిర్వాహకులు డాక్టర్ ఎం. శ్రీరామచంద్, టి. వినయ్ వివరించారు. నవంబర్ 25 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల పాలనాధికారి పారువెల్ల రామారావు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్, డిపార్ట్మెంట్ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



నవతెలంగాణ - భగత్‌నగర్

అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం నామినేషన్‌ల స్వీకరణకు చివరిరోజు కావడంతో మానకొండూర్, కరీంనగర్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వచ్చిన నామినేషన్ వివరాలు, వాటితో దాఖలు చేసిన పత్రాల వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. రిటర్నింగ్ అధికారులు వచ్చిన నామినేషన్‌లను పరిశీలించి ఈ రోజే నామినేషన్ ల స్వీకరణ అనంతరం నిర్వర్తించాల్సిన పనులను ఈ రోజే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు, కరీంనగర్ రిటర్నింగ్ అధికారులు లక్ష్మీకిరణ్, మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని వెలిచాల క్రాస్ రోడ్ వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీం చెక్ పోస్ట్‌ను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అక్రమ తరలింపులను గుర్తించినట్లయితే వాటిని సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ చేయించాలని తెలిపారు.

రామకిష్టాపూర్‌లో బీఆర్ఎస్ ఇంటింటికీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- కొడిమ్యాల

మండలంలోని రామకిష్టాపూర్‌లో బీఆర్ఎస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకెరవిశంకర్‌కు మద్దతుగా సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ మేనేని రాజనరసింగరావు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమలాపురం సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్ పాల్గొన్నారు.

సుంకె రవిశంకర్‌కు విరాళం అందజేత



నగదు అందజేస్తున్న స్వాతిక్

నవతెలంగాణ- మల్యాల

మల్యాల మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన కొండగట్టు డైరెక్టర్ పోచమ్మలా ప్రవీణ్ కుమారుడు సాత్విక్ తన పాకెట్ మనీ నిమిత్తం జమ చేసుకున్న రూ.40వేలు చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్‌కు ప్రచార ఖర్చుల కోసం అందజేశారు.

ఎంపీపీ జాజాల భీమేశ్వరి ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి ప్రచారం నిర్వహించారు. వేములకుర్తిలో ముదిరాజ్ సంఘ సభ్యులు దాదాపు 300 మంది డాక్టర్ సంజయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సర్పంచులు సున్నం నవ్యశ్రీ, సంగం సాగర్, సింగిల్ విండో చైర్మన్ అంకతి రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి నేమూరి సత్య నారాయణ, దశరథ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, సున్నం సత్యం, దేశెట్టి రాజారెడ్డి, పిట్ల వంశీ, రాజేందర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన యువకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ -మెట్‌పల్లి

మల్లాపూర్ మండలానికి చెందిన పలువురు యువకులు శుక్రవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

తొమ్మిదేండ్లల్లో జరిగిన అభివృద్ధిని చూడండి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ-కథలాపూర్

రాష్ట్రంలో తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ అన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించగా వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి గణేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు సౌజన్య గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్లపెల్లి అంజయ్య, వర్దినేని నాగేశ్వర్ రావు,ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొద్దు బాలు,కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని రేగుంట సాతారం గ్రామాల్లో జడ్పీటీసీ సంధిరెడ్డి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సభ్యులు డీలర్ మల్లయ్య, అధికార ప్రతినిధి ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్‌రావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు రాజన్న నరేష్‌రెడ్డి, భైరి రవికుమార్ యాదవ్, అమీనుద్దీన్, రాకేష్ యాదవ్, దశ రెడ్డి, నరేష్ రాజేందర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-గోదావరిఖని:

23 రామగుండం నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) అరుణశ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) అరుణ శ్రీ, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రావుఫ్ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, సింగరేణి ఆర్జీ-1 చింతల శ్రీనివాస్, రామగుండం స్వీప్ నోడల్ ఆఫీసర్ స్వరూప రాణి పాల్గొన్నారు. రామగుండం రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ)అరుణ శ్రీ మాట్లాడుతూ పోల్గొని పోలింగ్ సమయంలో ఓటు హక్కు వినియోగం, పరిశీలన, ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరించారు. చైతన్య రథంతో కళాజాతర బృందం కళాకారులచే ప్రజలకు ఓటు హక్కుపై అవగా హన, ఓటు ప్రాధాన్యత గురించి తమ గేయరచన, ఆట, పాటలతో ప్రజలను చైతన్య పరిచారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ

సింగరేణి కాంట్రాక్టు కార్మికులను కలిసిన మనాలీ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న మనాలీ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:

తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను కాంగ్రెస్ నాయకురాలు మనాలీ రాజ్ ఠాకూర్ శుక్రవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికుల శ్రమ దోపిడీ జరిగిందని అన్నారు. కార్మికులందరికీ సరైన గుర్తింపు రావాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమని అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాతపల్లి ఎల్లయ్య, రాసకట్ల భాస్కర్, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బహుజన రాజ్య స్థాపనకు విరాళం అందించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్

బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష స్వగృహం నందు శుక్రవారం మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్గిర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు మాణిక్రం సిండే, జలక్ రాజ్ జీవనే, మాధవ్ కబాడేలు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో బహుజన రాజ్య స్థాపనకై పెద్దపల్లిలో బీఎస్పీ జెండా ఎగరవేయాలని కోరుతూ తమ వంతుగా 15000/- రూపాయల చెక్ ను విరాళంగా బీఎస్పీ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉషకు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ తమపై వచ్చిన నమ్మకాన్ని ఒమ్ము చేయబోమని బహుజన రాజ్యాన్ని స్థాపించి తీరుతామన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి జిల్లా ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యమ అనిల్‌ను నియమించారు. దుద్దిళ్ల శ్రీధర్ బాబు నియామక పత్రం అందించారు. తన నియా మకానికి సహకరించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, కృతజ్ఞతలు తెలిపారు.





ప్రచారం చేస్తున్న నాయకులు

గుండంపల్లి గ్రామంలో గల్ఫ్ కార్మికుల ప్రచారం

నవతెలంగాణ-మల్లాపూర్

గ్రామాల్లో ఉన్న గల్ఫ్ కార్మికుల కుటుంబాలు ఇండిపెండెంట్ అభ్యర్థి శ్రీనివాస్‌రావుకు ఓటు వేయాలని తెలంగాణ కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపక కిరణ్ కుమార్ పిచర, గల్ఫ్ కార్మిక నాయకుడు మంద భీంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ నాయకులు సంగెము మోహన్‌రెడ్డి, రఘు ఎలిగేటి, గల్ఫ్ రిటనీలు లక్ష్మణ్, సాయిలు, బుచ్చిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్‌లో ఫిర్యాదు చేయొచ్చు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు మొబైల్ ద్వారా చేయొచ్చు అని సాధారణ పరిశీలకులు హెచ్. బసవ రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి శాసన సభ నియోజకవర్గంలోని ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదు తమ సెల్ నెంబర్ 7780139582కు తెలియజేయాలని సూచించారు.

రక్తదానం చేసిన యువకుడు



రక్తదానం చేస్తున్న మహేష్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన శ్రీ రామ్ మహేష్ అనే యువకుడు వర్షకొండ గ్రామానికి చెందిన వారికి రక్తం అవసరం కాగా మహేష్ స్వచ్ఛందంగా వెళ్లి రక్తాన్ని ఇచ్చాడు. స్వచ్ఛందంగా రక్తాన్ని ఇచ్చిన మహేష్‌ను పలువురు అభి నందించారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బుగ్గారం

బాలల దినోత్సవం పురస్కరించుకొని బుగ్గారం మండల కేంద్రంలో గల శ్రీ గ్లోబల్ హై స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌కు వివిధ ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు హాజరై వారి ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నక్కరాజు మాట్లాడుతూ.. పిల్లలు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

భజన కళాకారులకు హార్మోనియం వితరణ

నవతెలంగాణ -ఎండపల్లి

మండలంలోని గొడిశెలపేట గ్రామానికి చెందిన భజన కళాకారులకు స్థానిక సర్పంచ్ మెతుకు స్వరూప స్వామి తండ్రి లింగయ్య జ్ఞాపకార్థం హార్మోనియం పెట్టెను బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు అరికిల్ల మహేందర్, వార్డు సభ్యులు అల్క సుందర్, దొంత రాజయ్య, అల్క ఎల్లయ్య, అల్క నారాయణ, రాజేశం, ఒడిగ చంద్రయ్య, జనుప నర్సయ్య, మద్దెల లచయ్య, దొంత నర్సయ్య, గర్నే పురుషోత్తం, బేతి నర్సయ్య, చిప్పరి బుచ్చయ్య, ఒడిగ సురేష్, అల్క నర్సయ్య పాల్గొన్నారు.



నవతెలంగాణ 10
పెద్దపల్లి
శనివారం | నవంబర్ 11, 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రతి గడపకు తీసుకెళ్లాలి

రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్



నవతెలంగాణ-గోదావరిఖని:
దీపావళి పండుగ తర్వాత బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టో గురించి తమ డివిజన్, గ్రామంలో ఇంటింటికి, గడప గడపకు వివరించాలని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కార్యకర్తలకు సూచించారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీపంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా హాజరై, తనను ఆశీర్వదించి, మద్దతు తెలిపిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో మరోమారు గెలిపించాలని, తాను గెలిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానన్న కేటీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నా రు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, రాష్ట్ర కార్యదర్శి మూల విజయా రెడ్డి, కార్పొరేటర్లు గాదం విజయ నందు, బాల రాజ్ కుమార్, పిల్లి రమేష్, ముల్కల గోవర్ధన శాస్త్రి, శ్రీనివాసరెడ్డి, హమీద్, శాంత లక్ష్మి, అనుముల కళావతి, మేకల శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

సుస్థిర పాలన కోసం బీఆర్ఎస్‌ను ఆదరించాలి
రాష్ట్రంలో సుస్థిర పాలన కోసం ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీనే ఆదరించాలని ఆ పార్టీ నాయకుడు జిమ్మిబాబు ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 5 సంవత్సరాలు కుర్చీల పంచాయితే ఉంటుందని, రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడు తుందన్నారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ పదేళ్ల ముందు పాలన ఎట్లుంది... ఇప్పటి పదేళ్ల పాలన ఎట్లుందో తెలంగాణ ప్రజలు గమనించి ఓటు వేయాలన్నారు.

నేటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి
సభను జయప్రదం చేయండి

రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. స్థానిక దుర్గనగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్నం 12గంటలకు జరిగే ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితోపాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నారని అన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లో 500 మంది చేరికలు
కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, నాగన్న ఆధ్వర్యంలో 500 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి మక్కాన్‌సింగ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఆయన మాట్లాడుతూ రామగుండం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న తనను చేతి గుర్తుకు ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

మైనార్టీ సోదరులను కలిసిన కాంగ్రెస్ అభ్యర్థి

నవతెలంగాణ-గోదావరిఖని:
ఎన్టీపీసీ ఏరియాలోని మజీద్ ఎ జబల్ వద్ద శుక్రవారం మైనార్టీ సోదరులను కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ కలిశారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మాయ మాటలు నమ్మవద్దని అన్నారు. మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు అని చెప్పి మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ ప్రాంత బిడ్డగా నాకు చేతి గుర్తుకు ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.

ఘనంగా ఎస్ఎల్‌సీ స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం

నవతెలంగాణ-రామగిరి



పరిశీలిస్తున్న ఎంఈవో పల్లెపాటి సంపత్ రావు

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోనీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎస్ఎల్‌సీ స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం సాయిరాం గార్డెన్స్ వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహి ంచడం జరిగింది. కార్యక్రమానికి కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిలుగా రామగిరి మండల విద్యాధికారి పల్లేపాటి సంపత్ రావు, లేడు అకాడమీకు మేనేజర్ కుమారి, ఐశ్వర్య పాల్గొన్నారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ, పిల్లలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కృష్ణవేణి పాఠశాల ముందు వరుసలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు చేసిన యాక్టివిటీస్ కూడా చాలా బాగున్నాయని, వీటిని తయారుచేయడంలో ఉపాధ్యాయునిల పాత్ర ఎంతవుందో అంతకంటే విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర ఎక్కువ అని, ఇలాంటి కార్యక్రమం ప్రతి పేరెంట్ సహకారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ రెడ్డి, రంజిత్ రెడ్డి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆదరించాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్

నవతెలంగాణ-ముత్తారం:
తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించాలని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కోరారు. ముత్తారం మండలం ఓడేడ్, అడవీశ్రీరాంపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటిస్తూ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో రాత్రి పూట కరెంట్ కారణంగా రైతులు పాము కాటు, కరెంట్ షాక్‌లకు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత, పీఏసీఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు, మడల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్‌లు పాల్గొన్నారు.

ముస్లింలకు సముచిత స్థానం ఇస్తున్న కేసీఆర్

రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్



ముస్లింలతో రామగుండం ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 41, 49 డివిజన్ల పరిధిలోని అశోక్ నగర్, గాంధీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ముస్లీం మైనార్టీలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల విద్య కోసం మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, రంజాన్ రోజున రంజాన్ తోఫాలను అందిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మతకల్లోలాలు లేని శాంతియుత పాలన సాగిస్తుందని, ముస్లిం మైనారిటీల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని, కేసీఆర్‌ని హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రంలో శాంతియుత పాలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు గన్నుకుల మహాలక్ష్మి-తిరుపతి, దుబాసి లలిత-మల్లేష్, తోకల రమేష్, సతీష్, కొంకటి లక్ష్మణ్, బొంకూరి మధు, మైస రాజేష్, వెంకటేష్, మైస మొగిలి, అల్లంకొండ రాజయ్య, జావిద్, హసన్, తాజ్, యాకూబ్, చోటు, షఫీఖాన్, అజ్జు, ఇమ్రాన్,గఫూర్ రియాజ్, వెంకటేష్, రవితేజ, పాల్గొన్నారు.

అవినీతి లేకుండా పాలన అందిస్తా

రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:
అవినీతి లేకుండా రామగుండంలో ప్రజలకు రామరాజ్యం తరహాలో పరిపాలనను అందిస్తానని బీజేపీ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి అన్నారు. శుక్రవారం బీజేపీ అభ్యర్థి సంధ్యారాణికి మద్దతుగా పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు గోదావరిఖని ఒకటో పోలీస్ స్టేషన్ వద్ద ఘన స్వాగతం పలికి సంధ్యారాణికి మద్దతుగా పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ఆటపాటలు కోలాటాలు, డ్యాన్సులు, డబ్బు చప్పులతో నిర్వహించిన నామినేషన్ మహోత్సవం కార్యక్రమానికి ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం బీజేపీ అభ్యర్థి సంధ్యారాణి మాట్లాడుతూ... గోదావరిఖని చౌరస్తా పోచమ్మ సాక్షిగా.. పోచమ్మ తల్లి స్థలాన్ని కబ్జా చేసిన నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. త్రి లింగేశ్వర స్వామి శివుడి సాక్షిగా.. దుర్గ మాత దేవి సాక్షిగా... నన్ను గెలిపిస్తే రామగుండానికి రామ రాజ్యాన్ని తీసుకువచ్చి ప్రజలకు పాలన అందించడంతో పాటు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని ప్రమాణం చేశారు. ఇక్కడి స్థానిక నాయకుడు గెలిచాక రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉద్యోగాల పేరుతో ఎంతో మంది యువకులను మోసం చేయడంతో ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయని ఇలాంటి వారిని మళ్లీ గెలిపిస్తే మరిన్ని కుంభకోణాలకు పాల్పడతారని విమర్శించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సుల్తానాబాద్ ప్రభుత్వ కళాశాల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సుల్తానాబాద్
ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 అధ్వర్యంలో బుధవారం కోడిమ్యాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లోసుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థి సహని సత్యం ఉత్తమ ప్రతిభ కనపరిచాడు.19 సంవత్సరాల విభాగంలో 10వ తేదీ నుంచి సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

50 వేల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-ధర్మారం
ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పొన్నం సత్తవ్వ మల్లేశం కుమార్తె రక్షిత పెళ్లి కోసం అలయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు సత్గురు ఎంటర్ప్రైజెస్ ధర్మారం బూమ సంపత్, గూడెపు సతీష్ 50 వేల రూపాయల విలువ గల పెళ్లి సామాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేందర్ గౌడ్, సెక్రటరీ మామిడిశెట్టి శ్రీనివాస్, పీఆర్వో బైరి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు తోడేటి మురళి గౌడ్, కందుల సతీష్ సభ్యుడు బొల్లం మల్లేశం, భూమ సంపత్‌లు పాల్గొన్నారు.